# లంచం

కనుచీకటి పడేవేళ! ఎడతెరిపి లేని ముసురుతో నీళ్ళుకారుతోంది లోకం. ఊరికి సమీపంగా వచ్చిన కుటుంబయ్య దూరంనుంచి వీధి దీపాలు చూసి నీరసాన్ని విదిలించుకుని నడక వేగం హెచ్చించాడు. కాలువేసి తీసిన చోటల్లా గుంటడు నీళ్లూరుతూ నేలంతా బురదమయంగా వుంది.

చినుకులు ధాటిగా పడుతూ వాన ఎక్కువయ్యే సూచనలు కన్పించాయి. రయ్‌మంటూ వీచిన ఈదురు గాలికి ఆపాదమస్తకం వణికిపోయాడు కుటుంబయ్య. తడి తుండుగుడ్డ తీసి నీళ్ళు పిండి మొహం తుడుచుకున్నాడు.

గాలి ఎడా పెడా హోరు మంటూ వీచింది.

గంట స్తంభం గంటలు గణ గణ మోగాయి.

ఆశతో చుట్టుపట్ల చూశాడు కుటుంబయ్య.

కాస్త దూరంలోనే ఏదో గుడి కన్పించింది.

పంచె ఎగబట్టుకుని చెరువు గట్టు మీద బురద తొక్కుకుంటూ గుడి కేసి నడిచాడు. వాననీళ్ళు చేరిన గుంటలో కాళ్లు కడుక్కుని మండపం మిదికి వెళ్ళాడు.

శివాలయం వూరికి కొంచెం దూరంగానే వుంది. మండపం మీద నుంచి చూస్తోంటే గొడ్ల పాకలూ - ఇంకా దూరంగా లోగిళ్లూ కన్పిస్తూన్నాయి.

ఎక్కడికీ వెళ్ళ బుద్ధికాని కుటుంబయ్య మడపంమీదే నించున్నాడు. శరీరం నీరసంతో తూలుతోంది. మనస్సు క్షణక్షణానికి బండబారుతోంది.

బాగా చీకటి పడింది.

మబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి. ఉన్నట్టుండి గాలీ వానా ఉధృతం అయ్యాయి. భోరున కుంభవృష్టి కురవసాగింది. దక్షిణం వేపు నుంచి జల్లు ఈడ్చి ఈడ్చి కొడుతోంది. మండపంలో మూడొంతులు తడిసి పోతోంది.

నిశ్చలంగా నించున్న కుటుంబయ్య ముద్ద ముద్దయ్యాడు రెండడుగులు వేసి సంది చాటుకు తప్పుకున్నాడు.

కాళ్లు దగ్గిరకి తీసుకుని ముడిచి పెట్టుకుని కూర్చున్నాడు. అసలే మసిగుడ్డలా వున్న పంచె బురద చిందులతో అసహ్యం కలిస్తోంది. బురదలో నానినాని ఒరిసిపోయిన పాదాలు చల్లగాలికి భగభగ మండుతున్నాయి.

మంచుకన్న చల్లగా — నిట్టూర్చాడు కుటుంబయ్య. ఒక్క నెల రోజుల క్రిందట —

కంట్రాక్టర్ కుటుంబయ్య — లక్షాధికారి! బి. ఏ. చదువుతోన్న కొడుకూ - వేడీ వెచ్చా చూసే భార్యా — చుట్టాలు స్నేహితులూ — నౌకర్లూ —— చాకర్లూ పదిమందిలోనూ — ఫలానా అన్న పలుకుబడీ — అతిశయం పుష్కలంగా — వుండేవి.

ఇప్పుడు — ఈ క్షణం .... కుటుంబయ్య ఎవరు? ఎక్కడున్నాడు? ఎండకి ఎండుతూ, వానకి తడుస్తూ — భార్యా బిడ్డల్నీ, ఆప్తుల్నీ వదిలేసుకుని - ఆత్మాభిమానంతో ఇల్లు విడిచి — పరిచితులకు చాటుగా మాటుగా మొహం దాచుకుని — వూళ్ళమీద తిరుగుతోన్న దౌర్భాగ్యుడు! భ్రష్టుడు!

చలించిపోయాడు కుటుంబయ్య.

కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

జీవచ్ఛవంలా కూలబడిపోయాడు.

* * *

వయస్సు పెరిగి బుద్ధి తెచ్చుకోవాల్సిన ఈడులోకూడా ఆకతాయిగానే తిరిగాడు — కుటుంబం.

సంవత్సరాలకు సంవత్సరాలే బరువు బాధ్యతలు తెలీకుండా దొర్లాయి. చేతికి అందివచ్చే పద్నాలుగేళ్ళ కొడుకూ. కంటిలో పాపలా మసులుకొనే పెళ్ళాం - ఏళ్ళ తరబడీ పరాయి చోట ఉన్నా తన మట్టుకు తను జల్సాగానే గడిపాడు.

ఏదో పండక్కి అత్తవారింటి కెళ్ళిన కుటుంబం తన ఎదటే కొడుకు

4)

మేనమామని ఒక్క అర్థ రూపాయి అడగటం విన్నాడు. వినీ విననట్టు వూరుకున్నాడు

మేనమామ కాస్త వెటకారం మిళాయించి నవ్వాడు – "విగ్రహం మల్లే మీ అయ్య కనిపించటం లేదట్రా నన్నడుగుతావేం డబ్బులు?"

రాముడు మొహమంతా చిట్లించుకుని "మా అయ్య యివ్వలేదని నీకు తెలీదా! నాకు తెలీదా! నీ దగ్గరవుంటే ఇస్తావను, లేకపోతే లేదు" — అంటూ విసురుగా వెళ్ళిపోయాడు.

బావ మరిది నవ్వుకి తల తీసేసినట్లయింది కుటుంబానికి. జేబులు తడుముకున్నాడు, రూపాయి దొరికింది. కొడుకు వెనకాల పరిగెత్తాడు.

ఆ వూపుతోనే పెళ్ళాన్నీ, కొడుకునీ తీసుకొచ్చేశాడు.

కాపరం పెట్టాడు.

కడుపులు నిండిన ఆకలి ఆలోచనల్ని పదునెక్కించింది. ఆలోచించి ఆలోచించి నరసప్ప దగ్గరకి పరిగెత్తాడు.

"అయ్యా! మీరు నాకేదో దారి చూపించాలి. మా యింటిదాన్నీ పిల్లణ్ణీ తీసుకొచ్చేశాను. ఇకనుంచీ ఏదో పని చూసుకుంటాను. కష్ట పడతాను. మొగపుట్టుక పుట్టాను కానా?" అన్నాడు పౌరుషంగా.

నరసప్ప నిజంగా సంతోషించాడు. నమ్మి సలహా అడిగిన కుటుంబానికి మనసంతా పెట్టి దారి చూపించాడు.

"ప్రస్తుతానికి నా కంట్రాక్టుల్లో ఒకటి రెండిస్తాను. శ్రద్ధగా చేసుకో. పోను పోను వాటిల్లోనే కూరుకు పోతావు" అంటూ ఉపాయం చెప్పాడు. వ్యాపారంలో సుళువు బళువులన్నీ చెప్పాడు. మెళుకువలు నేర్పాడు. అప్పటికో వెయ్యి రూపాయలు పెట్టుబడికూడా పెట్టాడు.

పొరుగూళ్ళో ఏటా వానాకాలంలో పొంగుతూ వచ్చే గెడ్డ పొలాల మీదికి ఇసుక మేటలు వేస్తూంటుంది. దాని ఆటలు కట్టిస్తూ ఓ సిమ్మెంటు గోడ కట్టే పని తను తీసుకున్నాడు కుటుంబం.

ఆ పనిలో చాలా ముడిసరుకూ ఖర్చూ కలిసివచ్చాయి. పర్రలమీద కుప్పతిప్పలుగా పడి వున్న ఇసక చేయించాడు.

నీళ్ళకి అక్కడి కక్కడే టలు తవ్వించాడు.

సమీపంలో ఉన్న కొండరాళ్లు బద్దలు కొట్టించి పునాదుల్లోకితోయించాడు. గోడల పొడుగునా పేర్పించాడు.

పొలం పనులు లేని రోజులు కావటం చేత గోళ్ళు గిల్లుకొంటూ కూర్చున్న పల్లెటూరి కూలీలని చౌక చౌక కూలికి పిలిపించాడు. సిమ్మెంటూ సున్నం మాత్రం బళ్ళతో తోలించాడు.

రాత్రింబవళ్ళూ పనిచేయించేసి పట్టుమని పదిరోజుల్లో అయిందనిపించేశాడు. ఇంజినీరు శల్య పరీక్షలకి అగగలిగేంత పటిష్టంగా వుంది గోడ: చేసిన పని మెప్పు పొందింది.

ఆ కంట్రాక్టులో రెండువేలకు పైగానే చేతిలో మిగిలింది —"ఆహా! డబ్బు గడించటం యింత తేలికా?" — అనుకున్నాడు- కుటుంబం- అన్నిటి కన్నా ముందు చేసిన పని దేవుడి మొక్కు- చెల్లించటం.

"ఒరేయ్ బాబూ! రిక్షాను పిలు, కొబ్బరికాయల బస్తా గుడికి తీసి కెళ్ళాలి" అంటూ ఆజ్ఞ జారీచేశాడు కొడుక్కి.

రామం రిక్షా పిలవటం మాని తండ్రిని ఆక్షేపించాడు- "ఎందుకు నాన్నా? ఇవన్నీ తీసుకెళ్ళి వాళ్ళకి అప్పగించటం, దేవుడు ఎక్కడైనా వుంటాడంటారుగదా? ఆ కొబ్బరికాయలు కొట్టటం ఏదో మనింట్లోనే చేసి అడుక్కు-తినేవాళ్ళకి పంచిపెట్టరాదూ? వాళ్ళయినా తింటారు తృప్తిగా."

కుటుంబయ్య విస్తుపోయాడు కొడుకు మాటలకి - "అదేంట్రా? అలా కమ్యూనిస్టోడిలా మాట్లాడుతున్నావు? గుళ్లూ గోపురాలూ ఎందుకు వెలిశాయి? అక్కడ మొక్కులు చెల్లించుకుంటే పుణ్యంకాదా?"

"ఏం పుణ్యం — దేవుడికంటూ దోచిపెట్టటమేగానీ — కొబ్బరి హల్వాలూ - లడ్కా-రా వుండలూ యెవరిళ్ళలో తయారౌతాయో మనకి తెలీదా? ఆ తినటం కడుపునిండా లేనివాళ్ళెందుకు తినకూడదు?"

"అదేంటి? మున్నాటంనై రోజులూ ఆ గుళ్ళని కనిపెట్టుకు వుండేవాళ్ళు తింటే తప్పేంటి? అయినాగానీ ఎవడు తింటే మనకెందుకు లెద్దూ. దేవుడే తింటాడన్న నమ్మకంతో యిస్తాం - దేవుడికే యిస్తున్నా మన్న తృప్తితో వుంటాం. అలాంటి ఉద్దేశ్యంతోనే మనము యిచ్చినప్పుడు అవి దేవుడికే అందుతాయి. దేవుడే ఒక కంట మనల్ని చూడకపోడు."

రామం నోరు మూసుకుని రిక్షాకోసం వెళ్లాడు. కుటుంబం పెళ్లాంతో సహా బయల్దేరి వెళ్ళి మొక్కు-తీర్చేశాడు. "నీ దయవల్ల నాకు కలిసిరావాలేకాని నీ మేలు మర్చిపోను భగవంతుడా! చల్లగా చూడు" అని ప్రార్థించాడు. తిరిగి వచ్చిన అరబస్తా కొబ్బరిచిప్పలూ మూటకట్టి మళ్ళా రిక్షాలో వేయించింది మంగమ్మ.

ఎగ బడుతోన్న ముష్టివాళ్ళనీ చిన్న పిల్లల్నీ అదిలిస్తూ ఓ చిప్ప చితగ్గొట్టి డబ్బంతలేసి ముక్క-లు పంచి పెట్టింది. ఇంటికి రాగానే తల్లితో అన్నాడు రామం — "అమ్మా కొబ్బరి చిప్పలన్నీ ముక్క-లు చెయ్యవే! అదిగో! బడి వదలిపెట్టారు. చిన్న పిల్లల్ని తీసుకొస్తాను. ఫలహారం పంచి పెడదాం" - అంటూ ఉత్సాహం ప్రదర్శించాడు. మంగమ్మ కసిరింది- "చాల్లే! ఊరుకో. చిప్పలన్నీ ఎండబెట్టి గానుగ ఆడించుదామను కొంటున్నాను. కావాలంటే నువ్వో చిప్ప కొరుక్కు-తిను."

"ఛీ! నాకేం వొద్దు"- అంటూ బయటికి పోయాడు రామం. కొడుకు వైఖరి చూసి తల్లి సణుక్కొంది- "బాగుంది నాయనా! తండ్రికి కాస్త వివరం తెలిసిందని సంతోష పడుతోంటే యిక నువ్వు తయారౌతున్నావా దుబారా చెయ్యటానికి?"- అనుకొంది.

* * *

దైవికంగా కలిసివచ్చిన మొదటి కంట్రాక్టుతో కుటుంబయ్య మహోత్సాహంతో వ్యాపారంలోకి దిగాడు. రోడ్డు పని తీసుకున్నాడు— బాగానే మిగిలింది. తూములపని చేయించాడు. ఫర్వాలేదనుకున్నాడు. ధీమాగా తన పేరు మునిసిపాలిటీలో కాంట్రాక్టర్‌గా రిజిష్టర్ చేయించుకున్నాడు.

చిన్నా చితకా కంట్రాక్టులు నొల్లుకోసాగాడు. ఎడతెరిపిలేని పనులతో వూపిరి పీల్చుకోవటానిక్కూ-డా ఖాళీలేకుండా వ్యాపారంలో మునిగిపోయాడు. వ్యాపార రహస్యాలన్నీ ఆకళింపుజేసుకున్నాడు. నూటికి నూటిరవై పాళ్ళ వ్యాపారస్థుడయ్యాడు.

ఐదారేళ్ళు గిర్రున తిరిగాయి.

కుటుంబం - కుటుంబయ్యగా రయ్యాడు.

పాతికవేలు ఖరీదుచేసే డాబా కట్టాడు. కంట్రాక్టర్‌లా గాకుండా యజమానిలాగే కట్టించాడు. పెళ్ళానికి నగలు చేయించాడు. గతమంతా మర్చిపోయి పెళ్ళాం తనని జన్మ జన్మలకూ అంటిపెట్టుకు వుండేలా బంగారంతో ముంచిపించాడు. కొడుక్కి కావలసినంతా ఖర్చుపెడుతూ కాలేజీలో చదివిస్తున్నాడు. టాక్సీ లెక్కదానికి నామోషీపడి ఒకటోరకం కారు కొన్నాడు.

ఎంత అంతస్తులోనైనా - ఎంత ఐశ్వర్యంలోనైనా మర్చిపోనిది మాత్రం ఒకటి - దేవుడి మొక్కు.

ఏటా పెద్దపెట్టున పెళ్ళంత వేడుకగా సత్యనారాయణ వ్రతం చేయిస్తానని మొక్కుకున్నాడు. అన్న మాట తప్పకుండా ప్రతి యేటా వ్రతాలు చేశాడు. వ్రతానికి వారంరోజులు ముందునుంచే ఏర్పాట్లు- లగ్న నిర్ణయం - శుభలేఖలు అచ్చొత్తించటం, కావలసిన వాళ్ళందర్నీ పిలవటం పెళ్ళంత హడావుడి.

ఇక వ్రతం నాడు సంబరంమాట చెప్పనక్కర్లేదు. సినిమా పాటలూ హోరెత్తించే లౌడ్‌స్పీకర్లు - సినిమా ట్యూన్లు వాయించే బ్యాండుమేళం- ఖంగుమంటూ యిల్లు ప్రతిధ్వనించే పురోహితుల మంత్రోచ్చారణ - వచ్చే కార్లు - పోయేకార్లు - ఇంటిచుట్టూ ఈగల్లా ముసిరే ముష్టివాళ్ళు— విస్తళ్ళకోసం ఎగబడే వూరకుక్కలు - అంతా సందడే! ఏక సందడి.

రాత్రి చీకటిపడేవరకూ కొడుకు యింటికి చేరకపోవటం తప్పితే వ్రతంనాడు మరే లోపమూ వుండేది కాదు.

అలాంటి ఆర్భాటాలు యెన్నో చేశాడు. ఎన్నెన్నో చేశాడు.

"కుటుంబయ్యగారు మహా భక్తుడు."

"ఈ కలియుగంలో యిలాంటి పుణ్యాత్ముల్ని యెక్కడ చూస్తాం?"

"కడుపే కైలాసం, ఇల్లే వైకుంఠం అనుకునేవాళ్ళకి దైవభక్తేం వుంటుంది?"

"ఆ భగవంతుణ్ణి నమ్మితే వాడెప్పుడూ చల్లగానే చూస్తాడు"

ఇత్యాది పొగడ్తలన్నీ విన్నప్పుడు కుటుంబయ్య ముసిముసిగా హుందాగా నవ్వుకునేవాడు.

తను భక్తిపరుడు కాడని యెవరనగలరు? దేవుడు మాత్రం అనగలడా?

"ఏడుకొండలవాడా! వెంకట్రమణా! శ్రీరామచంద్రా! భద్రాద్రివాసా! మీరంతా చల్లగా చూడాలి. మీ మేలు మర్చిపోను" – ఏ రాయి కనపడ్డా ఓ దండం పెడుతూనే ఉండేవాడు.

దేవుళ్ళంతా కుటుంబయ్య గోడు విన్నారో ఏమో, అనుకోకుండా పెద్ద అవకాశం దొరికింది.

గవర్నమెంటు పని – నదిమీద వంతెన.

అంత పెద్ద కంట్రాక్టు ఎప్పుడూ తీసుకోలేదు. అయినా ఉరకలు వేస్తోన్న ఉత్సాహంతో ముందడుగు వేశాడు కుటుంబయ్య.

"అంతా గవర్నమెంటోడిది. కొడితే యిందులోనే కొట్టాలి" అనుకున్నాడు కడుపులో. టెండరు పెట్టాడు – పని రెండు లక్షలకి చేస్తానని.

పోటీ వచ్చిన కంట్రాక్టరిద్దర్నీ మోమాటపెట్టి – చెరో ఐదువేలూ యిచ్చి చేతి చలవతో పోటీ విరమించుకోమని బ్రతిమిలాడాడు. తన దాబా ప్రభుత్వానికి హామీ చూపించాడు. మొత్తంగా కంట్రాక్టు ఖాయం చేసుకున్నాడు.

ఆ కంట్రాక్టుమీద కుటుంబయ్య బాగా ఆశ పెట్టుకున్నాడు. కుటుంబయ్యమీద సూపర్‌వైజర్లు కూడా బాగానే ఆశపెట్టుకున్నారు. అందరి ఆశలూ తీరేలాగ వాళ్ళ జేబులు బరువు చేశాడు కుటుంబయ్య. పని ప్రారంభించాడు. చెక్ – మెషర్‌మెంటు జరుగుతోనే ఉంది. వర్కు–పాసౌతోనే ఉంది. రెండు నెలలకీ సగంపైగా పని ముగిసింది. పార్టు బిల్లుకి అప్లయ్ చేశాడు. సకాలంలో అందలేదు డబ్బు.

పలుకుబడిమీద మళ్ళా కొన్నివేలు వడ్డీలకు తెచ్చాడు. ఆరు నెలలలో దాదాపు పని పూర్తయిందనిపించాడు. బోసిగా ఉన్న నదిమీద ముచ్చటగా తయారైంది వంతెన. కానీ తన రెండు కళ్ళూ పెట్టి వంతెనకేసి ధైర్యంగా చూడలేకపోయాడు ఎప్పుడూ.

వంతుల ప్రకారం తన వాటా దిగమింగి కూర్చున్న ఇంజనీరు కిక్కురుమనకుండా వర్కు పాస్ చేసేస్తాడన్న ధైర్యం మాత్రం ఖచ్చితంగా ఉంది. ఆఖర్న చిల్లర మల్లర పనులు చకచకా చేయించసాగాడు. నేడో రేపోనని ఎదురుచూస్తోన్న సమయంలో పిడుగులాంటి వార్త విన్నాడు.

డిపార్టుమెంటు ఇంజనీరు బదిలీ అయిపోయాడు. వాళ్ళకీ వాళ్ళకీ ఏవో గొడవలున్నాయి. ఆ ఇంజనీరుక్కూడా సరిగ్గా తెలీకుండా బదిలీ జరిగింది. మరోడు కొత్తగా వచ్చేశాడు. వాడు సాక్షాత్తూ అగ్నిహోత్రుడే.

కుటుంబయ్య కాళ్లు విరగదొక్కుకున్నాడు. "ఏం దారి భగవంతుడా!" — అని నెత్తి బాదుకున్నాడు. తెలిసిన వాళ్ళందరిదగ్గిరికీ పరుగులెత్తాడు.

"ఎంత అగ్నిహోత్రుడైతే మాత్రం దోసెడు నీళ్ళు చిలకరిస్తే చల్లబడకేం చేస్తాడు లేవోయ్!" - అన్నాడు నరసప్ప. మొదట్నుంచీ నరసప్ప మాటమీద చాలా నమ్మకం ఉన్న కుటుంబయ్య ధైర్యం కూడ గట్టుకున్నాడు. గుండె నిబ్బరం చేసుకున్నాడు— "దేవుడా, నీదేభారం! ఈ గండం గడిపించావో వెయ్యినూటపదహార్లు నీ దిబ్బెంలో వేస్తాను. తల నీలాలిస్తాను. గౌరీపూజ చేయిస్తాను. నీ గుడి ముందు సంతర్పణ పెట్టిస్తాను. ఏడుకొండలవాడా! వెంకట్రమణా నీ భక్తుణ్ణి రక్షించు" - అంటూ ముడుపు కట్టాడు.

గుండె కాస్త కుదుటపడింది.

నాలుగు బుట్టలనిండా పళ్ళూ ఫలహారాలూ, నేతి డబ్బా – పంచెలచాపూ – ఏవేవో పట్టించుకు బయల్దేరాడు అగ్నిహోత్రంగారి దర్శనానికి.

తీరా అగ్నిహోత్రాన్ని చూస్తే ఉన్న భయం కాస్తాపోయింది! చిరునవ్వుతో పలకరించా డా వ్యక్తి.

కుటుంబయ్య ఒంగి ఒంగి దణ్ణాలెట్టాడు, బహుమతు లిచ్చాడు. "తమరు .... రైలు వంతెన తనిఖీ.... నే నేనండి బాబూ కంట్రాక్టర్ని. పుట్టెడు పిల్లలు కలోణ్ణి" - అంటూ నీళ్ళు నమిలాడు.

కంట్రాక్టర్ అతి వినయమంతా చిరునవ్వుతోనే పరికించాడు అగి

హోత్రం. పళ్ళ బుట్ట తీసుకుని మిగతావి పట్టుకు పొమ్మన్నాడు.

"ఇప్పుడు కాదు. ఇవ్వాల్సినప్పుడు ఇద్దువులే అవన్నీ" — అన్నాడు. కుటుంబయ్య సంతోషంతో వెర్రివాడయ్యాడు — "బాబూ! తమరు దయ చూడాలి. మీ మేలు మర్చిపోను జన్మ జన్మలకి" — అంటూ వాగుడు పెంచ కుండా జారుకున్నాడు.

* * *

అగ్నిహోత్రం వంతెన తనిఖీకి వచ్చాడు ... కుటుంబయ్య చేతులు కట్టుకొని వెనకాల నిలబడ్డాడు.

తనిఖీ ప్రారంభించాడు — ఇంజనీరు.

వంతెన పొడుగునా తిరిగి చూశాడు.

ఏడెనిమిదిచోట్ల సిమెంటు పెచ్చులు ఊడదీయించాడు — టెస్ట్‌కి పంపించాడు.

దిమ్మలు బద్దలు కొట్టించి ఇనప కమ్మీలు బయట పెట్టాడు కొల తలు తీశాడు. వస్తువుల నాణ్యం చూశాడు.

వంతెనంతా ఎక్కడికక్కడ రంధ్రాలు పెట్టాడు.

చిట్టచివరికి బండారం బయటపడింది. సగానికి సగం మోసం జరిగింది టెండర్‌లో. ఒప్పుకున్న దొకటీ! చేసింది ఒకటీ! తక్కువ సిమెంటు! చౌకబారు కాంక్రీటు! చౌక బారు సున్నం! అంతా చౌక చౌక! ఇనపకమ్మీల మధ్య వుండకూడని ఖాళీ. ఉపయోగించినవన్నీ అల్పమైన వస్తువులు. తక్కువ తక్కువ కొలతలు! అంతా దగా! మోసం!

ఉగ్రుడయ్యాడు అగ్నిహోత్రం.

గజ గజలాడాడు కుటుంబయ్య.

"ఏమయ్యా, ఏమిటిది?" — నిప్పులు కురిపించాడు ఇంజనీరు.

" ........ "

కట్టావా? బొమ్మరిల్లు కట్టావా?
అంటూ నిలబడ్డాడు కుటుంబయ్య.

"బుద్ధి లేదటయ్యా! ఎవడబ్బ సొమ్ము దిగమింగుదా మనుకున్నావ్? లక్షలాది ప్రజలు ప్రయాణాలుచేసే రైలువంతెన ఇసుక పర్రతో పని జరిపిస్తావా? నీ కిచ్చే రెండు లక్షలూ ఎందుకూ? లంచాలు గుప్పటానికా? నీ ఖజానా నింపుకోటానికా?"

"హఠాత్తుగా వంతెన కూలి ఏ రైలు బండో నదిలో మునిగి— ప్రజలు బలవంతపు చావు చస్తే ఆ పాపం ఎవరిది? ఎవరిదయ్యా? ఇలా చూడు. నీది! లేకపోతే నాది. తెలిసిందా?"

కిక్కురు మనకుండా తల దించేసుకు నించున్నాడు కుటుంబయ్య — ఇంజనీరు భరించలేని కోపంతో నిప్పులు కక్కాడు —

"ఈ వంతెన అనుకున్న బరువుకి ఆగదు. ఈ వర్కు పాసవ్వ టానికి ఎంతమాత్రం వీల్లేదు. కూలదోయించి తిరిగి కట్టాల్సిందే. పునాదు లతో సహా మళ్లా జరిపించు. అంత వరకూ నీకు పేమెంటు లేదు.

ప్రభుత్వాన్ని ఇంత ఘోరంగా మోసంచేసే నువ్వు గొప్ప కంట్రా క్టర్‌వా? నీమీద కేసు పెడతాను, నిన్ను బ్లాక్‌లిష్ట్ చేయిస్తాను. నువ్వు కాకాలు పట్టిన సూపర్‌వైజర్లందర్నీ సస్పెండ్ చేయిస్తాను. మీరు చేసిన అన్యాయమంతా కోర్టు కెక్కిస్తాను. తెలిసిందా?" – అంటూ గర్జించాడు.

కుప్పలా కూలిపోయిన కుటుంబయ్యని యింటికి చేర్చారు ఆప్తులు. తెలివి వచ్చాక లబోలబోమని నెత్తినోరూ బాదుకున్నాడు కుటుంబయ్య.

ఇంకేముంది సర్వనాశనం! సర్వనాశనం!

చేతిలోవున్న యాభై వేలూగాక – మరో యాభై వేలకు పైగా అప్పుచేసి వంతెన కట్టాడు.

ఇప్పుడు రెండులక్షలు పెట్టి మళ్లా కట్టాలి.

నగానట్రా కొంపాగోడూ తెగనమ్మినా వడ్డీలకు చాలదు. అప్పు పుట్టదు. డబ్బుపోయింది. పరపతిపోయింది.

"ఏం దారి? ఏం దారి?" – అంటూ ఘొల్లుమన్నాడు.

నిద్రాహారాలు మాని ఆలోచించాడు దారికోసం.

*   *   *

ఆ కటిక చీకట్లో – ఆ రాత్రివేళ – అంత ఒంటరిగా – దేవుడి ఎదుట – దుఃఖం ఆపుకోలేకపోయాడు. కుటుంబయ్య.

ఇల్లువిడిచింది మొదలూ ఎక్కడికో తెలీకుండా తిరుగుతూనే వున్నాడు.

తిండిలేదు నిద్రలేదు. గుడ్డలు మాసి మసిగుడ్డలయ్యాయి. గడ్డం ఒత్తుగా పెరిగింది. ఆఖరికి బికారిలా మిగిలాడు.

వర్షం బాగా తగ్గింది.

దూరం నుంచి లైటుతీసుకుని నడిచి వస్తోన్న వ్యక్తి కన్పించాడు. దగ్గిరికి వచ్చి మండపం ఎక్కాడు– పూజారి.

"ఎవరదీ! అలా పూజ గడపకి అంటుకుంటూ పడుకున్నారేమిటీ? లే, లే, దూరంగా కూర్చో! అయినా అలా ఊళ్లోకిపోరాదూ? ముష్టి వాళ్ళు దేవుడిగుళ్లో పడుకోవడం ఏమిటి? పాప పుణ్యాలు తెలియకపోతే సరి" రుసరుసలాడుతూ – పెద్ద చప్పుడుతో గర్భగుడి తలుపులు తీశాడు.

పూజారి మాటలకు సిగ్గుపడిపోయిన కుటుంబయ్య గడపకు దూరంగా జరిగాడు.

తాత్కాలికంగా మనస్సులో బాధ అణుచుకుని గర్భగుడిలోకి చూస్తూ కూర్చున్నాడు.

అగరు సువాసనలు గాలిలోకి చొచ్చుకువచ్చాయి. గుడిలో– వెచ్చగా జ్యోతి వెలుగుతోంది. శివపార్వతుల విగ్రహాలకు పట్టువస్త్రాలు కట్టబెట్టి ఉన్నాయి. గంధం పూతలు పూసి వున్నాయి. బంగారపు ఆభరణాలేవో అలంకరించి ఉన్నాయి. చిత్రమైన సింగారాలతో ఎత్తయిన గద్దెమీద అమర్చి వున్నాయి.

పూజారి గొణుక్కుంటోన్నట్టు మంత్రాలు చదవటం ప్రారంభించాడు. విస్తరాకులతో తెచ్చిన ప్రసాదం విగ్రహాల ముందు పెట్టాడు. నైవేద్యం సమర్పించాడు. భళ్ళుమంటూ కొబ్బరికాయలుకొట్టాడు. గణగణా గంటవాయించి హెచ్చరిక చేశాడు.

హారతి కర్పూరం వెలిగించి హారతులిచ్చాడు. తతంగం ముగించి

గబగబా బయటికి వచ్చాడు. గర్భగుడి తలుపులు మూసి తాళం వేశాడు.

చేతిలో కొబ్బరిచిప్ప ద్వారబంధానికేసి కొట్టి పన్నెంతముక్క- కుటుంబయ్యమీదికి విసిరాడు — చాలుగానీ వెళ్ళు వెళ్లు. అలా వూళ్లోకి పో!" – అని మరోసారి కసిరి బరువు బొజ్జతో బురదలో తప తప అడుగులు వేసుకొంటూ లాంతరు వూగించుకొంటూ వెళ్ళిపోయాడు.

గడచిన నలభై నాలుగేళ్ళ జీవితంలోనూ, ఎన్నడూ ఎరగనంత దుఃఖం వచ్చింది కుటుంబయ్యకి.

"భగవంతుడా! నువ్వే దిక్కని నమ్మినందుకు యింత చేశావా!" అంటూ బావురుమన్నాడు.

పాపం కుటుంబయ్య భగవంతుడిమీద బాగా నమ్మకం పెట్టుకున్నాడు. తన సంతోషం ఎప్పటికప్పుడే భగవంతుడికి పంచి పెట్టాడు. చేసినపని కలసి వచ్చినప్పుడల్లా ఆనందంగా మొక్కుబళ్ళు తీర్చాడు. దేవాలయాలన్నీ తిరిగాడు. పెద్ద పెద్ద మొత్తాలు దబ్బెంలో వేశాడు. రెండు మూడుసార్లు తలనీలా లిచ్చాడు. భార్యతో సహా లక్ష్మీ పూజలు చేయించాడు. భజనలు చేయించాడు. హరికథలు చెప్పించాడు.

కాస్త పెద్ద మొత్తం పెట్టి తన పేర ఓ గుడికూడా కట్టించాడు.

కుటుంబయ్యలాంటి భక్తుడు కలికాలంలో లేడన్న కీర్తి పొంది పరవశించిపోయాడు.

భార్య – మంగమ్మకూడా దేవుడి కార్యాలలో ఏం చెప్పినా ఏకీభవించి చేదోడువాదోడై మసిలేది.

కొడుకు – రామం మాత్రం – తల్లిదండ్రుల చేష్టల్ని ఆక్షేపించకుండా వుండలేకపోయేవాడు.

"నాన్నా! నీ దానాలూ ధర్మాలూ ఏ దేవుడికీ అందవు. నీలాంటి చాదస్తులు దేవుడి ఖజానాలు పెంచుతోంటే వాటిని కొల్లగొట్టి భద్రపరచుకునేవాళ్ళు వేరే వున్నారు. వాళ్ళని దేవు దేమీ అడ్డుపెట్టటం లేదు. అది తెలిసికూడా మనం దేవుడి పేరుతో ఇలా చెయ్యటం వివేకం కాదు."

"అదేమిట్రా బాబూ? గుండెలు తీసినట్టు మాట్లాడతావ్! దేవుడి సొత్తు ఎవరు తీస్తే వాళ్ళదే పాపం. అందుకని మనం పూజా పునస్కా-

రాలూ మానేసుకుంటామా? భక్తి శ్రద్ధలతో భగవంతుణ్ని కొలిస్తే మన పుణ్యం మనకి ఉంటుంది కదా! భగవంతుడు మెచ్చుతాడు కదా?"

"భగవంతుడు మెచ్చేది నీ మంచి ప్రవర్తన చూసికానీ – తనకి నువ్వు జరిపించే ఆర్భాటాలు చూసికాదు నాన్నా! జీవితంలో ఒక్కసారికూడా భగవంతుడి పేరు ఎత్తకపోయినా – నువ్వు నీతి నిజాయితీలతో జీవిస్తే భగవంతుడు నిన్ను తప్పకుండా మెచ్చుకుంటాడు.

అయితే ఈ ప్రజలంతా బుర్రలేనివాళ్లే నంటావా? ఏ గుడికి వెళ్ళి చూస్తావో చూడు. భద్రాచలం – తిరుపతికొండ – సింహాచలం – అన్నవరం ఒక్కటేమిటి? – ఎక్కడ చూసినా వేలకొద్దీ భక్తులు కన్పిస్తారు. భగవంతుణ్ని దర్శించుకోవాలని తహతహలాడుతూంటారు. పూజలు చేస్తారు. వ్రతాలు చేస్తారు. మొక్కులు మొక్కుతారు. కోరికలు కోరుకుంటారు. వాళ్లంతా పిచ్చివాళ్ళా?"

"పిచ్చివాళ్ళో వెర్రివాళ్ళో నాకు తెలీదు. నా బుర్రతో ఆలోచిస్తే నాకు తోచింది మాత్రం చెప్తున్నాను. బలహీనతలు వదిలించుకుని ఆలోచిస్తే ఎవరికైనా యిదే తోస్తుందని నేననుకుంటున్నాను. దేవుడి పేరుతో నువ్వు డబ్బుపాడుచేస్తుంటే నాకు ఎంతో బాధగా ఉంది!

ఈ దేవాలయా లన్నిటిమీదా లక్షలకొద్దీ రాబడి వస్తోంది, అవునా? అదంతా ఏమౌతోంది? ఎవరు తింటున్నారు? ఎలా వినియోగ పడుతోంది? ఏ సంస్థలు నడుస్తున్నాయి? ఏ పరిశ్రమలు సాగుతున్నాయి? ఎవరు దీన్ని గురించి పట్టించుకుంటున్నారు?

తెలిసి తెలిసి ఎందుకు నువ్వు వెయ్యి రూపాయలు దిబ్బెంలో వెయ్యాలి! ఎందుకు దేవుడుకి బహుమతు లివ్వాలి?

ఒక వంక దేశంలో నిరుద్యోగం – ఆకలిబాధా – అవసరాలూ పెచ్చు పెరుగుతోంటే మన కర్తవ్యం ఏమిటి? దేవుడి పేర డబ్బునీ బంగారాన్నీ – వృధా చెయ్యటమా? దేవుడి గుళ్ళల్లో మగ్గబెట్టటమా? దేవుడు ఈ రాక్షసత్వాన్ని మెచ్చుకుంటాడా? పూజలు చేసినంతమాత్రాన పుణ్యం ఇస్తాడా?

నువ్వు పాపం చెయ్యకుండా ఉండాలని ఎందుకు ప్రయత్నించవు? నువ్వు దేవుడి కిచ్చే మొక్కులన్నీ పెట్టుబడిగా పెట్టి చిన్న పరిశ్రమ ఏదో ప్రారంభించు. పదిమంది బీదవాళ్ళకి పని కల్పించు. దేశంలో కొంత దారిద్ర్యాన్ని సడలించు. అప్పుడు నీకు కలిగే ఆనందం - సంతృప్తి ఏ పూజ యిస్తుందో - ఏ వ్రతం యిస్తుందో - ఆలోచించు."

అలా గంటలకొద్దీ మాట్లాడే కొడుకు మాటలు వింటూ కంగారు పడిపోయేవాడు కుటుంబయ్య — ఒరే! ఒరే! దేవుణ్ని గురించి అలా మాట్లాట్టానికి నీకు భయం వెయ్యటంలేదూ?"

"ఎందుకూ? నేనేం చేశాననీ?"

టప్పు టప్పుమని చెంపలు వాయించుకునేవాడు కుటుంబయ్య — "పసి వెధవ! అశుభమూ శుభమూ తెలియని వాడు. మన్నించు దేవుడా!" అంటూ బితుకూ బితుకూ మంటోన్న గుండెలతో ప్రార్థించేవాడు. ఈ క్షణం అదంతా ఆలోచిస్తోంటే - కుటుంబయ్యలో అంతకాలమూ మినుకూ మినుకూ మంటూ వెలిగే అంతరాత్మ ఒక్కసారి ప్రకాశవంతమైంది. తన దైవభక్తి వ్యర్థమై దోషిగా ఎందుకు నిలబడ్డాడు?

నిజానికి తను దేవుణ్ని పవిత్రమైన హృదయంతో - మనస్ఫూర్తిగా ఆరాధించాడా?

దేవుడి మొక్కులు ఎందుకు మొక్కాడు?
దేవుడి ప్రార్థనలు ఎందుకు చేశాడు?

"నే నెందుకు భయపడతాను? పాపంచేసేవాళ్ళే భయపడతారు దేవుడికి" - అంటాడు రామం.

నిజమేనా? తను పాపం చేయబట్టే దేవుడికి భయపడ్డాడా? పాపం చేసినన్నాళ్ళూ భయపడుతూనే వున్నాడా?

— సుదీర్ఘంగా నిట్టూర్చాడు కుటుంబయ్య. తన పాప భీతికి దైవ భక్తిని అడ్డంగా పెట్టుకున్నాడు. తను అన్యాయంగా గడించిన సొమ్ములో వాటా పెడితే దేవుడు సంతోషిస్తా డనుకున్నాడు. తన పూజలకీ — మొక్కులకీ మెచ్చిన దేవుడు తన పాపాల్ని కడిగివేస్తాడని నమ్మాడు.

తన శీలాన్నీ — ప్రవర్తననీ ఎంచి చూడకుండా దేవుడు కూడా తనతో లాలూచీ పౌతా డనుకున్నాడు.

తన పాపాలు గంగాస్నానాల్లో కడిగేసుకోవా లనుకున్నాడు. తన తప్పిదాలు దేవుడి మొక్కులతో వదిలించేసుకోవా లనుకున్నాడు. తను పాపభీతికి వెరిచి నీతి నిజాయితీలతో ప్రవర్తించి వుంటే ఈనాడీ దీనత్వం - భ్రష్టత్వం - సంభవించేవి కావు.

సంభవించేవి కావు

కుటుంబయ్య కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు.

భరించలేని ఆకలితో కడుపు భగభగా మండుతోంది.

అలసిన శరీరం దారుణమైన చలితో కుంచించుకు పోతోంది.

కళ్ళ ఎదుటి గాఢాంధకారం మృత్యుభీతి కల్గిస్తోంది. గర్భగుడి రాతి విగ్రహాలముందు ఆకుల నిండా అన్నం వుంది.

సజీవమైన మానవ మాత్రుడికి ఆకలి తీర్చగలిగే అన్నం వుంది. జడివానలో - చలిగాలిలో దయనీయమైన దుస్థితిలో - అనుభూతులకులోనై తపించే ప్రాణికి - సేదదీర్చగలిగే వాతావరణం వుంది. వెచ్చదనం వుంది. అగరు ధూపం ఉంది. జ్యోతి కాంతి ఉంది!

దేవుడికి పంచభక్ష్య పరమాన్నాలతో విందులు చేసిన కుటుంబయ్య - దేవుడికి గుడి కట్టించి ఆశ్రయం ఏర్పరచిన కుటుంబయ్య — దేవుడికి మహోత్సవాలు చేసి మురిసిపోయిన కుటుంబయ్య —

ఎందు కంత దీనాతిదీనమైన స్థితిలో వున్నాడు?

"ఎందుకు?" అనుకున్నాడు కుటుంబయ్య.

దేవుడికి చేసే విందులూ నైవేద్యాలూ వ్యర్థం!

దేవుడికి చేసే మహోత్సవాలన్నీ నిష్ప్రయోజనం!

దేవుడికి చెల్లించే మొక్కులు స్వార్థపరులకు స్వాహా!

ఏదీ దేవుడికి అంటదు- దేనినీ దేవుడు మెచ్చడు.

మనిషికి యిచ్చే లంచం దేవుడికి కూడా యివ్వగలవా నాన్నా!" అన్నాడు రామం చాలా సార్లు.

ప్రతిఫలాపేక్ష లేని హృదయారాధన తప్ప -

దేవుడికి ఏం చేసినా - యిచ్చినా లంచమే అవుతుంది.

దేవుడు లంచం తీసుకోడు. అవును. తీసుకోడు.

అపరాధిని శిక్షిస్తాడు. శిక్షించి తీరుతాడు. "భగవంతుడా! నేను మూర్ఖుడినై నిన్ను స్వార్థదృష్టితో ప్రార్థించాను. తప్పుడు విలువలతో నీ పవిత్రతని శంకించాను. నన్ను మన్నించు ప్రభో! మన్నించు" — కుటుంబయ్యకు సర్వసంపదలూ పొందినంత ఆనందం కల్గింది.

ఏం చేస్తే దేవుడు సంతోషిస్తాడు?

ఏం చేస్తే దైవారాధన అవుతుంది? - కుటుంబయ్యకి తెలిసింది.

గాలికి గంట స్తంభం గంటలు గణ గణ మోగాయి.

(1965 దీపావళి "యువ" నుంచి)